

'చెప్పరా...! జగ్గూ... ఏంటి విశేషాలు... అంతా బాగున్నారా! అమ్మ ఎలా ఉంది... ఏం... రా.. మాట్లాడవు...'

'నన్ను మాట్లాడనిస్తే న్రా... నువ్వు... అంతా బాగానే ఉన్నారు. వదినకి ఆరోగ్యం బాగానే ఉంది... తొమ్మిదో నెల వచ్చింది. నా బ్యాంకు ఉద్యోగం చాలా భేషుగ్గా ఉంది. కాని అమ్మని... తలుచుకుంటేనే చాలా బాధగా ఉంది... కాని నేనేం చేయగలను...'

# ఆలోచించండి

**వాణి ఆనంద్**

ఏమైంది... అమ్మకి... ఏం జరిగింది... అన్నాను ఆత్రుతగా.

ఏమీ కాలేదు...రా... కంగారు పడకు.. ఆవిడ ఆరోగ్యం బాగానే ఉంది. నువ్వు రెండు నెలల్నించి... ఇదిగో వస్తాను.. అదిగో వస్తాను... అని వాయిదాలు వేస్తూ... దేశాలు పట్టుకు తిరుగుతున్నావు నీకు అమ్మని చూడాలని ఉందో... లేదో నాకు తెలియదు.. కాని అమ్మ మటుకు... ప్రతిక్షణం.. నిన్నే తలుచుకుంటోంది. అప్పుడప్పుడు ''నాకు రెక్కలుంటే బాగుండు న్రా...జగ్గూ... వాడు ఎక్కడ ఉన్నా... ఎంత దూరమైనా... ఎగిరివెళ్ళి చూసి వచ్చేదాన్ని...'' అని అనుకుంటూంటుంది.

అంత నిష్ఠూరంగా మాట్లాడకురా...జగ్గూ... నువ్వున్నావన్న ధైర్యంతో... నేను వాయిదాలు వేస్తూ వస్తున్నాను. ఈ రోజు ఉదయం ఇండియా వచ్చాను. ఇప్పుడు ఆంధ్రాలో వైజాగ్ సిటిలో ఉన్నాను. ఇక్కడ...డాక్టర్స్... అందరికి ఒక సెమినార్... ఏర్పాటుచేసి... ఫారెన్‌లో ప్రవేశపెట్టిన నూతన వైద్యవిధానాలు...చికిత్సలు గురించి చెప్పాలి... ఇక్కడ మీటింగ్ పూర్తయ్యాక.. రాత్రి బయలుదేరి... రేపు ఉదయం.. అమ్మ ఎదురుగా ఉంటానని చెప్పు... ఇంక ఎక్కడికి వెళ్ళకుండా... మన ఊళ్ళో అమ్మపేరుతో ఒక క్లినిక్ కడదామనుకుంటున్నానని కూడా అమ్మకి చెప్పు... సంతోషిస్తుంది... అన్నాను.

ఎన్నిసార్లు చెప్పలేదురా... ఇలాంటి కబుర్లు... అన్నట్టు ఒక ముఖ్యవిషయం చెప్పాలి నీకు... నువ్వు ప్రముఖ మానసిన వైద్యనిపుణుడవు కదా!... అమ్మ మనసులో ఏదో బాధ పడుతూంటుంది. అదేంటో తెలుసుకోవడానికి ప్రయత్నించ రాదూ...? వదిన పురిటికి వెళ్ళిందగ్గర్నుంచి ''ఒంటరిగా... ఉండలేక పోతున్నానురా...'' నన్ను ఓల్డ్ ఏజ్ హోంలో చేర్చరా... అని పట్టుబట్టు కూర్చుంది. అసలు వదిన పుట్టింటికి వెళ్ళడానికి ఒప్పుకోలేదు... ''అత్తయ్యగారు ఒక్కరూ ఉంటారు...నేను రాలేను...'' అని తీసికెడదామని వచ్చిన వాళ్ళ నాన్న గార్నికూడా వెనక్కి పంపేసింది. పాపం! తనక్కుడా నెలలు నిండాయి, పని చేసుకోలేకపోతోంది ఆ బాధ చూసి... అమ్మ.. వాళ్ళ నాన్న గార్కి ఫోన్‌చేసి రప్పించి...బలవంతాన ఆయనతో పంపింది. అప్పట్నుంచి అమ్మ.. ఒంటరితనంతో బాధపడతూ... మూడీగా ఉంటోంది. ఆవిడ కోరిక మేరకు ''ఓల్డ్ ఏజ్ హోం''లో చేర్చాను. అక్కడి వాతావరణం... వాళ్ళ అప్యాయతలు.. పలకరింపులు.. అమ్మకి నచ్చాయి... సంతోషంగానే ఉంటోంది. ఉదయం.. సాయంత్రం వెళ్ళి చూసి వస్తున్నాను.

ఆదేంట్రా... జగ్గూ... అంత పని చేసావ్... మనమంతా ఉండి ఎవరూ లేనట్టు... అన్నాను బాధగా


లేదురా... నాకూ బాధగానే ఉంది... కాని... ఏం.. చేయడం నువ్వు... వీలైనంత తొందరలో...వచ్చెయ్యి... ఆవిడ్ని తీసుకొచ్చేద్దాం...!

తప్పకుండానూ...! ఈరోజు రాత్రికే బయలుదేర్తాను... ఉంటాను... అమ్మ జాగ్రత్త... మీటింగ్ టైమవుతోంది... అంటూ సెల్ స్విచ్ ఆఫ్ చేసాను.

మీటింగ్ పూర్తయి... బయటకు వచ్చేసరికి...రాత్రి ఏడు గంటలయింది. రిలాక్స్‌డ్‌గా కళ్ళుమూసుకొని కుర్చీలో కూర్చున్నాను.

మిమ్మల్ని చూడటానికి ఎవరో వచ్చారు సార్... నర్సు పిలుపుతో కళ్ళుతెరిచి పంపించమన్నట్టుగా... కళ్ళతోనే సైగ చేసాను. నర్సు వెంటబెట్టుకొని వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను.

అమ్మా!... రా... అమ్మా... అంటూలేచి... చేయిపట్టుకొని తీసుకు వచ్చి నా కుర్చీలో కూర్చోబెట్టాను. ఫ్రిజ్‌లో వాటర్ బాటిల్ తీసి... గ్లాసులో పోసి... అమ్మచేతికందించాను. మంచినీళ్ళు త్రాగి రెప్పవే



యకుండా.. నన్నే చూస్తూ కూర్చుంది.

ఏంటమ్మా!... ఒంటరిగా... ఇంతదూరం... ఎలా రాగలిగావమ్మా!...తోడుగా...జగ్గూని తీసుకొని రాలేకపోయారా...?

నేను బయలు దేరుతున్నట్టు... ఎవరికీ తెలీదురా...ధనం..రేపు...ఉదయాన్నే వస్తానని చెప్పావుట కదా... అంత వరకు నిన్ను చూడకుండా ఉండలేక... సరాసరి ''హోం'' నుంచి వస్తున్నాను. ఆకలేస్తోంది రా నీ చేత్తో పెడితే... తినాలనుంది... అంది చిన్నపిల్లలా మారాం చేస్తూ.

బోయ్‌ని పిలిచి హోటల్ నుంచి భోజనం తీసుకురమ్మని పంపించాను.

నేను...ఒక గంటలో బయలు దేరదామనుకుంటున్నానమ్మా ఈలోపు... నువ్వే వచ్చావ్... మనిద్దరం కలిసి బయలుదేరదాం లే... నువ్వు కనిపించక... అందరూ కంగారు పడుతూంటారు... అవునూ! ఏదిక్కూ...మొక్కూలేనట్టు ''హోం''లో చేరడం... ఏంటమ్మా?... నలుగురూ... ఏమనుకుంటారు... అన్నాను నెమ్మదిగా.

అనుకునేది... ఏంటిరా... మనిష్టం మనది... మనకు నచ్చిన చోట నాలుగు రోజులుంటాం... లేకపోతేలేదు... ఈ మాత్రం దానికి... మనం ఎవరికీ భయపడాల్సిన పనిలేదు... అయినా నువ్వొచ్చేవరకే కదరా! అక్కడుండేది ఆ తర్వాత మజిలీ భగవత్ నిర్ణయం...

ఈ మాటల్లో... భోజనం రావడం...అమ్మతినడం.. పూర్తయింది.

ఎన్నాళ్ళ కోరికో... ఈ రోజు తీరింది... నీ చేత్తో తినగానే ఎంతో బలం వచ్చినట్టయింది. ఆప్యాయత... అనురాగాలతో మాకు ఆయుర్దాయం పెరుగుతుంది. ప్రేమాభిమానాలతో... పెట్టే పట్టెడన్నం ఎంతో బలాన్నిస్తుంది. పంచ భక్ష్య పరమాన్నాలు పెట్టినా... మేం తినలేం...తిని తిరగలేం...కాస్త వయసు మీద పడేసరికి... కాళ్ళు విరిగిన పాతకుర్చీలా... ఓ మూల పారేసి.. మాటా మంతీ లేకుండా... ఇంత తిండి పనివాళ్ళతో పంపేసి... చేతులు దులిపేసుకుంటుంటారు. మేం అంత భారంగా ఉన్నప్పుడు... మాకు నచ్చిన... వేరొక చోట ఉండాలనుకోవడం తప్పు ఎలా అవుతుందిరా?.. క న్నవాళ్ళు చూడటంలేదని... అర్ధాంతరంగా... జీవితాన్ని ముగించుకోలేం కదా...! వార్ధక్యం... దేవుడిచ్చిన శాపం రా... మాకు...

ఏంటమ్మా... ఏదేదో మాట్లాడుతున్నావు... ఎవరైనా... ఏధైనా...అన్నారా...?

లేదురా... ఏమీ అన్లేదు... ఆ పరిస్థితి రాకుండా జాగ్రత్త పడదామని... సాధారణంగా ప్రతీ ఇంట్లో వచ్చే సమస్యలే... ఇలాంటివన్నీ... మన ఇల్లు... ఇలాంటి వాటికి... అతీతం కాదనుకుంటున్నాను. తరతరాలుగా...అత్తాకోడళ్ళ మధ్య...అన్నదమ్ముల మధ్య...ఎవరూ పూడ్చలేని అగాధాలు ఏర్పడుతున్నాయి. ఎన్నో సమిష్టి కుటుంబాలుగా మారిపోతున్నాయి. ఒకరినొకరు అర్ధం చేసుకోకుండా... లేనిపోని ఊహలతో వాళ్ళ...వాళ్ల మనసుల్ని కలుషితం చేసుకుంటూ...ఒకే ఇంట్లో బద్ధశత్రువుల్లా ఉండేబదులు... దూరంగా ఉండటం మంచిదని ''ఓల్డ్ ఏజ్ హోం''లో చేరాను. అంతేగాని... మీ అందరిని వదులుకొని... నేను ఒక్కదాన్ని మాత్రం... అక్కడుండగలనా? చివరగా ఒక హెచ్చరిక చేసి పోదామని వచ్చాను. మనుషులు బతికుండగా పట్టెడన్నం పెట్టడానికి బాధపడి... వాళ్ళు మరణించాక... సంఘంకోసం...ఫోటోలకి దండలువేసి... ఒకపెళ్ళికంటే ఎక్కువగా సంతర్పణలు...దానాలు...ధర్మాలు చేయడం... ఎంతవరకు సమంజసం... ఈ కాలచక్రభ్రమణంలో ఈనాటి మా యెక్క దుస్థితి...రేపటి రోజున... కోడళ్ళు, అల్లుళ్ళు.. వచ్చాక మీకు అనుభవానికి రాకుండా... జాగ్రత్తపడండి... దానికి ఏ విధంగా మసలుకోవాలో... ఆలోచించండి.. మన సాంప్రదాయాలు... స్వార్ధం ముసుగులో మరుగున పడకుండా చూడండి. పాపం... కోడల్ని చూసి వారం రోజులయింది. ఆమెను కూడా...చూసి... అలాగే వెళ్ళిపోతాను.

ఏంటమ్మా!... ఏదోలా మాట్లాడుతున్నావ్... నీ మనసు బాగా గాయపడినట్టుంది... ఏం జరిగిందమ్మా!... చీకట్లో ఒక్కదానివి వెళ్లకు... నేనూ వస్తున్నాను... అమ్మా! ఆగు... అమ్మా!...

సార్!... సార్... లేవండి సార్... ఏదో కలవరిస్తున్నారు. ఒళ్ళంతా చెమటలు... ఏం...జరిగింది సార్...

నెమ్మదిగా కళ్ళు తెరిచాను... ఎదురుగా కంగారుపడుతూ కనిపించాడు కాంపౌడరు... ''ఏమైంది... నాకేమయింది'' అనడిగాను.

మీ కేకలు...విని లోపలకు వచ్చాను సార్... కాంపౌండరు సమాధానం.

అంతలో సర్దుకొని... ఓకే... అయామ్ ఆల్‌రైట్... మీరు వెళ్లండి...అని పంపించేసాను. ఆ తరువాత అన్నీ గుర్తుకువచ్చాయి. క్లాక్‌వైపు చూసాను. నాలుగంటలయింది... ఇంతసేపు పడుకున్నానా!... ఏదో కల... అమ్మ గురించి...అమ్మను చూడాలి... త్వరగా ఫ్రెష్ అయి కారు దగ్గరికి బయలుదేరాను. హడావుడిగా...సెల్ రింగయింది...

చెప్పరా!...జగ్గూ...అన్నాను.

ఒరేయ్ ధనం... అమ్మమనకిక లేదురా...రాత్రంతా...గుండెల్లో నెప్పితో బాధపడిందిట. డాక్టరు వచ్చి చూసే లోపల... చనిపోయిందిట...హోం మేనేజరు ఫోన్ చేసాడు... నువ్వు వెంటనే బయలుదేరు...నిన్న నేను చూసే సరికి బాగానే మాట్లాడింది...

ఇంతలో అలా జరుగుతుందనుకోలేదు.. అనాధనైన నన్ను తీసుకొచ్చి నీతో సమానంగా... పెంచి ఓ ఉద్యోగస్తుడిని చేసింది... చివరిసమయంలో ఆవిడ దగ్గరలేకపోయాను.... అంటూ ఏదేదో మాట్లాడుతున్నాడు.

అమ్మ నన్ను చూడాలనే ఉద్దేశ్యంతో... నాచేతి అన్నంతిని ఆమె... మనసులో బాధనంతా చెప్పుకున్నదన్నమాట... బ్రతికుండగా ఆవిడ మనోవేదనను అర్ధంచేసుకోలేకపోయాను... ఎంత పాపిష్టివాడిని అమ్మ మాటలే నా చెవిలో... మారుమ్రోగుతున్నాయి... యాంత్రికంగా కారులో కూర్చున్నాను.

★

